GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 310 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | సోమవారం 01-07-2024 | పేజీలు : 3

## దేశవ్యాప్తంగా దంచికొడుతున్న వానలు

**ఐఎండి హెచ్చరిక**

**టి మీడియా, జూన్ 30, న్యూఢిల్లీ :**



దేశవ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న నాలుగైదు రోజుల్లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించింది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో కురిసిన భారీ వర్షం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. వరదల కారణంగా ఢిల్లీలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ క్రమంలో వర్షాల కారణంగా 11 మంది మరణించినట్టు అధికారులు చెబుతున్నారు. తాజాగా బాదలీ ప్రాంత అండర్‌పాస్ వద్ద నిలిచిన నీటమునిగి ఇద్దరు బాలురు మృతిచెందగా, వోఖలా అండర్‌పాస్ నీటిలో స్కూటీతో చిక్కుకుపోయి దిగ్విజరుకుమార్ చౌధరీ (60) అనే వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీ నగరానికి ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికను జారీ చేసింది. హిమాచల్ ప్రదేశ్‌లోనూ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. శనివారం కురిసిన భారీవర్షాలకు కాంగ్డా, కులు, సోలన్ జిల్లాల్లో రహదారులను మూసివేశారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ వద్ద సూఖీ నదిలో చాలా కార్లు కొట్టుకుపోయాయి. అస్సాంలో వరదల పరిస్థితి శనివారం మరింత దారుణంగా మారింది. ఇక, తెలుగు రాష్ట్రాల్లోనూ పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.



# పూడికతో జూరాల ప్రాజెక్ట్

## తగ్గుతునన నీటినిల్వలు - ఆందోళనలో రైతులు

**టి మీడియా, జూన్ 30,మహబూబ్‌నగర్:**

ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయనిగా నిలుస్తున్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ పూడికతో నిండుకుంటోంది. ప్రతీ ఏడాది ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా ప్రాజెక్టులో పూడిక పేరుకపోతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో జూరాలపై ఆధారపడిన ఉమ్మడి జిల్లాకు త్రాగు, సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూరాల ప్రాజెక్ట్?లో పూడిక ఉమ్మడి మహబూబ్?నగర్ జిల్లా ప్రజలకు శాపంగా మారుతోంది. జలాశయం ప్రధాన క్రస్ట్ గేట్ల దిగువన స్లూయిజ్?లు లేకపోవడంతో ప్రతీ సంవత్సరం పూడిక పేరుకుపోతోంది. దీంతో జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యంపై ఈ భారం పడుతోంది. ఈ కారణంగా నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో అటూ త్రాగు, ఇటు సాగునీటి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చలేకపోతోంది ఈ జలప్రదాయని. 1995లో ప్రారంభమైన జూరాల జలాశయం వాస్తవంగా గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలు. పూడిక కారణంగా డ్యాంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని 2013లో 9.657టీఎంసీలకు సాగునీటి శాఖ అధికారులు తగ్గించారు. దీని కారణంగా జలశయంలో నీటి నిల్వ 2.283టీఎంసీల మేర తగ్గిపోయింది. నీటి నిల్వకు డ్యాంలో లోటు ఏర్పడడంతో పాటు వరదలు వచ్చే సమయంలో జలాల ఎత్తిపోతలకు కూడా ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ప్రస్తుతం జూరాలలో మరోసారి పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయింది. ఎగువన నుంచి వస్తున్న వరదల కారణంగా ప్రాజెక్ట్?లో ప్రతి ఏడాది పూడిక వచ్చి చేరుతోంది. మరోసారి ప్రాజెక్ట్?లో పూడికపై అధికారులు సమీక్ష చేస్తే మళ్లీ నీటినిల్వ సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్ట్?లో సుమారు 2 టీఎంసీలకుపైగా సామర్థ్యం తగ్గగా మళ్లీ మరో 2-3టీఎంసీల నీటినిల్వ తగ్గిస్తే త్రాగు, సాగు అవసరాలపై పెను ప్రభావం పడనుంది.నీటి పారుదల శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఒక టీఎంసీ నీటినిల్వతో ఒక పంటకు పదివేల ఎకరాలకు సాగునీటిని అందించవచ్చు. దీంతో ప్రతి పదేళ్లకు ఒకసారి పూడిక సమస్య కారణంగా గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం తగ్గించాల్సి వస్తే రానున్న రోజుల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన ఎత్తిపోతల పథకాలకు, తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తప్పేలా లేవు. గతేడాది ఏకంగా జూరాల ఆయకట్టు సాగుకు రబీలో క్రాప్ హాలీడ్ ప్రకటించాల్సిన దుస్థితి వచ్చింది. దీంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటోంది. సాగు, తాగు నీటి అవసరాలను తీర్చుతున్న ఇంత పెద్ద జలాశయం మనుగడకు పూడిక ముప్పు కాకుండా ఉండాలంటే ప్రభుత్వం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.



## తెలంగాణలో

# భారీ మీసేవ స్కామ్

- ఒక్కో సర్టిఫికెట్ రూ.50వేలు నుంచి రూ.5లక్షలు
- తహశీల్దారు లాగిన్ ఐడీ, సంతకం వాడకం
- 800ల కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు జారీ

**టి మీడియా, జూన్ 30,రంగారెడ్డి:**

**తెలంగాణలో మరో భారీ స్కామ్ బయటపడింది. రంగారెడ్డిజిల్లా మంచాల ఎమ్మార్వో ఆఫీస్‌లో భారీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. విచ్చలవిడిగా క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు జారీ చేశారు. హయ్యర్ ఎడ్యుకేషన్ కోసం అడ్డదారిలో సర్టిఫికెట్లు క్రియేట్ చేశారు. అనుమానం రాకుండా ఎస్డీపీ ఆపరేటర్ -2 పేరుతో లాగిన్ అయి మూడు ఫోన్ నెంబర్లతో భారీ స్కామ్‌కి పాల్పడ్డారు.**

తహశీల్దారు లాగిన్ ఐడీ మొదలు కొని సిగ్నేచర్ వరకూ విచ్చలవిడిగా వాడేశారు. 800మంది స్థానికేతరులకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు జారీ చేశారు. ఫీజ్ రియంబర్స్మెంట్ , స్కాలర్ షిప్, ప్రభుత్వ పథకాలకు అడ్డదారిలో సర్టిఫికేట్లు మంజూరు చేశారు.కొంతమంది నిందితులు గ్యాంగ్‌గా ఏర్పడి హైదరాబాద్ లోని పలు మీ సేవల ద్వారా దరఖాస్తూ చేసి.. ఈ స్కామ్‌కి తెరతీశారు. అర్జీదారులు లేకుండానే సర్టిఫికేట్లు విడుదల వేసి నేరుగా ఇంటికే పంపించింది గ్యాంగ్. ఒక్కో సర్టిఫికెట్‌కి రూ. 50వేల నుంచి రూ. 5లక్షలు వసూలు చేసింది. వీఆర్ఏ, డీటీ, ఆర్ఐల రిపోర్ట్ ప్రమేయం లేకుండానే గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం నడిపించింది. ఈస్కామ్ 2022 ఫిబ్రవరి నుంచి 2024 వరకూ నడిపించినట్లు తెలుస్తోంది. సుమారుగా 800కు పైగా సర్టిఫికేట్లు జారీ చేసి స్కామ్‌కి పాల్పడ్డారు. తహశీల్దార్ డిజిటల్ కీ సంతకంతో గుట్టుచప్పుడు కాకుండా వందల సంఖ్యలో సర్టిఫికేట్స్ క్రియేట్ చేసి అమ్ముకున్నారు. జేబులు ఫుల్లుగా నింపుకున్నారు.రాష్ట్రంలోని పలు చోట్ల మీసేవల్లో అప్లై చేసి.. స్కామ్ లు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు

### 420, 409 సెక్షన్ల కింద కేసు.. నిందితుల కోసం గాలింపు..

జిల్లా మైనార్టీ ఆఫీసు నుంచి మండల కార్యాలయానికి లేటర్ రావడంతో పరిశీలించిన అధికారులు స్కామ్‌ను గుర్తించారు. దీంతో తీగలాగితే డొంక బయటపడింది. అర్జీదారులను ఎవరనేదానిపై ఎంక్వైరీ చేయగా నాన్ లోకల్ అని తేలడం.. అప్లికేషన్లు కుప్పలు తెప్పలుగా ఉండడంతో అధికారులు కంగుతిన్నారు. స్కామ్‌పై మంచాల పీఎస్‌లో ఎమ్మార్వో ఫిర్యాదు చేశారు. స్కామ్‌లో భాగమైన కంప్యూటర్ ఆపరేటర్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సురేష్ తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. మంచాల ఎమ్మార్మో ఫిర్యాదు మేరకు 420,409 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. విషయం బయటకు పొక్కుండా గోప్యంగా ఉంచుతున్నారు అధికారులు..ఇలానే హైదరాబాద్ తోపాటు.. రాష్ట్రంలోని పలు చోట్ల మీసేవల్లో అప్లై చేసి.. స్కామ్ లు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఒక్క చోటనే ఈ స్కాం బయటపడిందని.. దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.



## డీఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి నివాళి..

**టి మీడియా, జూన్ 30,హైదరాబాద్ :**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ భౌతికయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడుగా 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి డీఎస్ ఎంతో కృషి చేశారని తెలిపారు. 2009లోనూ డీఎస్ సారథ్యంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. పదవులపై తనకు ఎప్పుడూ ఆశ లేదని డీఎస్ అనేవారని.. డీఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారని తెలిపారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అండగా నిలబడుతుందన్నారు. కుటుంబ సభ్యులతో చర్చించి డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని.. డీఎస్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు.




# కాంగ్రెస్‌లోకి చేరికల జోరు

### కాంగ్రెస్ ప్లాన్‌కు బీఆర్ఎస్ బాస్

## విరుగుడు వ్యూహం

**టి మీడియా, జూన్ 30, హైదరాబాద్:**




బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఎంతమంది కారు దిగతారు? కేసీఆర్‌కి హ్యాండ్ ఇస్తున్న ఎమ్మెల్యేల జాబితాలో ఇంకెంతమంది ఉన్నారు? బీఆర్ఎస్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్ వర్కవుట్ అవుతుందా? కాంగ్రెస్ ప్లాన్‌కు కేసీఆర్ దగ్గరున్న విరుగుడు వ్యూహం ఏమిటి? తెలంగాణ పాలిటిక్స్‌లో దీనిపై ఎలాంటి చర్చ జరుగుతోంది? అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత రాజకీయంగా ఇబ్బందిపడుతూ వస్తున్న బీఆర్ఎస్.. పార్లమెంట్ ఎన్నికల్లో వైఫల్యం తరువాత మరింత ఉక్కిరిబిక్కిరి అవుతోంది. గత కొన్ని రోజులుగా కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం రాజకీయంగా కారు పార్టీని కుదిపేస్తోంది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మరోవైపు బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకుంటామంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు పదే పదే స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కన్ఫ్యూజన్ మొదలైంది. పార్టీ ఎమ్మెల్యేల్లో ఎవరు ఎప్పుడు వెళ్లిపోతారో తెలియని పరిస్థితి. ఎమ్మెల్యేల ఫిరాయింపులకు అడ్డుకట్ట వేసేందుకు బీఆర్ఎస్ నాయకత్వం స్వయంగా రంగంలోకి దిగింది. పార్టీ ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఫామ్ హౌస్‌లో ఎమ్మెల్యేలతో భేటీ అవుతూ.. పార్టీ మారొద్దని సూచిస్తున్నారు. వచ్చేది మన ప్రభుత్వమే వారికి భరోసా ఇస్తున్నారు.బీఆర్ఎస్ నాయకత్వం ఇంతలా ప్రయత్నిస్తున్నా.. కాంగ్రెస్‌లోకి ఫిరాయింపులు మాత్రం ఆగడం లేదు. దీంతో పార్టీ మారే ఎమ్మెల్యేలపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు కేసీఆర్. అయితే కాంగ్రెస్ చెబుతున్నట్టుగా బీఆర్ఎస్ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకోవాలంటే మరో 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సి ఉంటుంది. దీంతో కాంగ్రెస్ పార్టీతో ఎవరెవరు టచ్‌లో ఉన్నారు.. ఎవరెవరు గతంలో సీఎంతో భేటీ అయ్యారు.. అని లెక్కలు వేస్తోంది బీఆర్ఎస్. గతంలో కాంగ్రెస్‌లో పని చేసిన ఎమ్మెల్యేలు తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానాలు పంపుతోంది కాంగ్రెస్. ఈ సమాచారం బీఆర్ఎస్ దగ్గర కూడా ఉంది. దీంతోపాటు గతంలో రేవంత్‌తో పని చేసిన ఎమ్మెల్యేలు, ఆయనతో సన్నిహితంగా ఉండే ఎమ్మెల్యేలు పార్టీ మారే అవకాశం ఉందని కారు పార్టీ పెద్దలు అంచనా వేస్తున్నారు.అయితే ఎలాగైనా బీఆర్ఎస్ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం అయ్యే పరిస్థితి రానివ్వకూడదని భావిస్తున్నారు కేసీఆర్. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. మరో 20 మంది కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటే తప్ప బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం అయ్యే అవకాశం ఉండదు. ఈలోగా పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపుల చట్టం అమలయ్యేలా.. సుప్రీంకోర్టుకు వెళ్లాలని పార్టీ నిర్ణయించింది. దీంతోపాటుగా అనేక అంశాల్లో ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత కనిపిస్తుందని పార్టీ భావిస్తోంది. దీంతో ప్రభుత్వం మీద పెన్షన్లు, రైతు భరోసా, వడ్లకు బోనస్ ఇలాంటి అంశాలపై ఒత్తిడి తెస్తే పార్టీ నుంచి చేరికలు కూడా ఆగిపోతాయని బీఆర్ఎస్ నేతలు ఆలోచిస్తున్నారు.ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కేసీఆర్ కుటుంబం నుంచే ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుతో పాటు మొదటినుంచి ఉద్యమంలో, పార్టీలో కొనసాగిన పద్మారావు, ప్రశాంత్ రెడ్డి లాంటి వాళ్లు ఉన్నారు. వీరితో పాటు పార్టీ కమిటెడ్‌గా పార్టీలో కొనసాగే వాళ్లు మరికొందరు ఉన్నారని బీఆర్ఎస్ భావిస్తోంది. ఏది ఏమైనా 15 నుంచి 18 మంది ఎమ్మెల్యేలు ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీని వీడే అవకాశం లేదని గులాబీ పార్టీ భావిస్తోంది. అదే జరిగితే బీఆర్ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకోవడం సాధ్యంకాదు. వచ్చే ఎన్నికల వరకు పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనైతికంగానే కొనసాగాల్సి వస్తుంది. దీనిపై కోర్టులో కేసులు.. స్పీకర్ వద్ద ఫిర్యాదులు కొనసాగుతూనే ఉంటాయి. ఈ రకమైన వ్యూహంతో ఫిరాయింపులను కట్టడి చేయడంతో పాటు ప్రభుత్వాన్ని టార్గెట్ చేయాలనే ఆలోచనతో కేసీఆర్ ఉన్నట్టు తెలుస్తోంది.

# రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- సంపద సృష్టిస్తాం సంపదను ప్రజలకు పంచుతాం
- మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**టీ మీడియా, జూన్ 30,మధిర:**





రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు మధిర నియోజకవర్గంలోని చింతకాని, మధిర మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సంపద రాష్ట్ర ప్రజలకు చెందాలని తమ ప్రభుత్వం ఈ గ్యారెంటీలను తీసుకువచ్చింది అన్నారు. గత దశాబ్ద పాలనలో అప్పుల పాలైన తెలంగాణను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నామని చెప్పారు. సంపదను సృష్టించి, సృష్టించిన సంపదను ప్రజలకు పంచుతామన్నారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు పోతుందని చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఆర్థికంగా ఎదగడానికి క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను అప్పగించామన్నారు. తెలంగాణలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయబోతున్న మీ సేవ సెంటర్ల నిర్వహణ కూడా మహిళలకు అప్ప చెప్తామని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వావలంబన కొరకై తమ ప్రభుత్వం మహిళ స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తుందని వివరించారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హైద్రాబాద్ ప్రజాభవన్ నుంచి ఉదయం 7గంటలకు రోడ్డు మార్గాన ఖమ్మంకు చేరుకున్న డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కకు జిల్లా అధికార యంత్రాగం, పార్టీ జిల్లా నాయకులు, శ్రేణులు స్వాగతం పలికారు. చింతకాని మండలం గాంధినగర్ కు చేరుకొని రూ.175లక్షలతో గాంధినగర్ నుంచి బొప్పారం వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత మధిర మండలం వంగవీడు గ్రామానికి చేరుకొని రూ. 30 కోట్లతో బోనకల్లు-అల్లపాడు- వంగవీడు గ్రామాల వరకు బిటి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. చిలుకూరు గ్రామంలోని శివాలయం వద్ద రూ.70 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ.285 లక్షలతో చిలుకూరు నుంచి దొడ్డదేవరపాడు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మధిర మండలం మర్లపాడు గ్రామానికి చేరుకొని. రూ.275 లక్షలతో మర్లపాడు నుంచి పెనుగొలను-సిద్దినేని గూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్తాపన చేశారు. ఆ తరువాత మాటూరు గ్రామానికి చేరుకొని రూ.500 లక్షలతో మాటూరు నుంచి ముస్లీం కాలనీ బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఆనంతరం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారి పొడవున ఆయా గ్రామాల ప్రజలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు ఘనంగా స్వాగతం పలికారు.

# మన్ కీ బాత్‌లో అరకు కాఫీ, కేరళ గొడుగుల ప్రస్తావన

- వికసిత్ భారత్ లక్ష్యం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



**టి మీడియా, జూన్ 30,ఢిల్లీ:**
మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'లో మాట్లాడారు. మోదీ 3.%ఉ%లో ఇది తొలి మన్ కీ బాత్. పలు కీలక అంశాల్ని ప్రధాని మోదీ ఇందులో ప్రస్తావించారు. మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం కొన్ని రోజులు ఆగింది కానీ.. మన్ కీ బాత్ స్ఫూర్తి దేశంలో వికసిస్తూనే ఉందన్నారు ప్రధాని మోదీ. దాదాపు నాలుగు నెలల తర్వాత ఆయన ఈ కార్యక్రమం ద్వారా జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రోగ్రామ్‌లో ఇది 111వ ఎపిసోడ్. అంతకుముందు ఫిబ్రవరిలో 110వ 'మన్ కీ బాత్' ప్రోగ్రామ్ చేశారు ప్రధాని మోదీ.మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మన్ కీ బాత్ కు సంబంధించి మూడు నెలల్లో లక్షల్లో సందేశాలు వచ్చాయన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తప్పకుండా వస్తానని, మా ప్రభుత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసం చూపించారు. అందుకే మీ అందరి మధ్య ఉన్నానని, వికసిత్ భారత్ కోసం కృషి చేస్తున్నామన్నారు.

### ప్రస్తావనకు వచ్చిన అంశాలు ఇవే!

ఆంధ్రా ప్రత్యేక కాఫీ గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. అరకు ఏజెన్సీలో పండించే ప్రత్యేక కాఫీ గురించి ప్రధాని మోదీ దేశ ప్రజలకు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు చెందిన ఎన్నో ఉత్పత్తులకు డిమాండ్ ఉందని, భారత్‌కు చెందిన ఏదైనా స్థానిక ఉత్పత్తి ప్రపంచవ్యాప్తం కావడం చూసినప్పుడు గర్వంతో నిండిపోయనన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని అల్లూరి సీతా రామరాజు జిల్లాలో అరకు కాఫీని అధిక మొత్తంలో పండిస్తారు. ఇది గొప్ప రుచి, సువాసనకు ప్రసిద్ధి చెందిందని మోదీ కొనియాడారు. స్థానిక ఉత్పత్తులకు ప్రజాదరణ పొందాలన్నారు.మన్ కీ బాత్ కార్యక్రమంలో లోక్‌సభ ఎన్నికలపై మాట్లాడారు. మన రాజ్యాంగం, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలపై తమకున్న అచంచల విశ్వాసాన్ని వ్యక్తం చేసినందుకు దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలు అన్న ప్రధాని.. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత పెద్ద ఎన్నికలు జరగలేదని, అందులో 65 కోట్ల మంది ఓట్లు వేశారు. దీని కోసం కృషీ చేసిన ఎన్నికల కమిషన్‌తోప్నా ఓటింగ్ ప్రక్రియతో పాల్గొన్న ప్రతి ఒక్కరిని మోదీ అభినందించారు.టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. ఈ విజయంతో 17 ఏళ్ల తర్వాత టీ20 ప్రపంచకప్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. ఈ చారిత్రాత్మక విజయంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు ప్రధాని మోదీ. భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. తమదైన స్టైల్లో ట్రోఫీని మరోసారి ఇంటికి తీసుకొచ్చారు. భారత జట్టును చూసిన నేను గర్వపడుతున్నాను అంటూ చెప్పుకొచ్చారు. అలాగే టోక్యో ఒలింపిక్స్ గురించి ప్రధాని మోదీ మాట్లాడారు. టోక్యో ఒలింపిక్స్‌లో మన ఆటగాళ్ల ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుందని మోదీ అన్నారు. టోక్యో ఒలింపిక్స్ నుంచి మన ఆటగాళ్లు పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్నారన్నారు. ఆటగాళ్లందరినీ కలుపుకుంటే, దాదాపు 900 అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నారు.మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రత్యేక రకమైన గొడుగుల గురించి ప్రస్తావించారు. ఈ గొడుగులు మన కేరళలో తయారవుతున్నాయని తెలిపారు. కేరళ సంస్కృతిలో గొడుగులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. అక్కడ అనేక సంప్రదాయాలు, ఆచారాలలో గొడుగులు ఒక ముఖ్యమైన భాగం. 'కర్తుంబి గొడుగులు' కేరళలోని అట్టప్పాడిలో తయారు చేయడం జరుగుతోంది. గొడుగులు చాలా అద్భుతంగా ఉంటాయి. ఈ గొడుగులను గిరిజన సోదరీమణులు తయారుచేస్తారు. ఈ గొడుగులకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఆన్‌లైన్‌లో కూడా విక్రయిస్తున్నారని మోదీ వెల్లడించారు.జూన్ 30 చాలా ముఖ్యమైన రోజు అని ప్రధాని మోదీ అన్నారు. మన గిరిజన సోదరులు, సోదరీమణులు ఈ రోజును 'హల్ డే'గా జరుపుకుంటారు. ఈ రోజు విదేశీ పాలకుల దురాగతాలను తీవ్రంగా వ్యతిరేకించిన వీరుడు సిద్ధో-కన్హు అద్భుతమైన ధైర్యంతో ముడిపడి ఉందన్నారు. వేలాది మంది సంతాలీ సహచరులను ఏకం చేశారని, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. 1857లో భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి రెండేళ్ళ ముందు అంటే 1855లో జరిగింది.జార?ండ్‌లోని సంతాల్ పరగణాలో మన గిరిజనులు విదేశీ పాలకులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టినట్లు మోదీ గుర్తు చేశారు.రేడియో కార్యక్రమంలో పర్యావరణం, మొక్కలు నాటడంపై ప్రధాని నరేంద్ర మోదీ చర్చించారు. ప్రపంచంలో అత్యంత విలువైన సంబంధం ఏది అంటే పర్యావరణం అన్నారు . పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ తల్లి కోసం మొక్కలు నాటుతున్నారని, ఉద్యోగం చేసే మహిళ అయినా, గృహిణి అయినా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతున్నారని ప్రధాని అన్నారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రచారం ప్రారంభించడం జరిగిందన్న మోదీ, ఈ ప్రచారం పేరు %-% ఏక్ పేడ్ మా కే నామ్ అన్నారు. ప్రతి ఒక్కరు తమ తల్లి పేరు మీద మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు.మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ తన తల్లిని గుర్తు చేసుకున్నారు. తల్లి పేరిట ఒక చెట్టును తప్పనిసరిగా నాటాలని ప్రధాని మోదీ అన్నారు. మా అమ్మ పేరు మీద కూడా ఓ చెట్టు నాటాను. మనందరి జీవితంలో తల్లికి అత్యున్నత స్థానం ఉంది. భూమి తల్లిని కూడా జాగ్రత్తగా చూసుకోండి. ఆమె కూడా మమ్మల్ని మా అమ్మలాగే చూసుకుంటుందని హితవు పలికారు.ఈ ఏడాది మే నెలలో తుర్క్‌మెనిస్థాన్‌లో జాతీయ కవి 300వ జయంతి వేడుకలు నిర్వహించామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచంలోని 24 మంది ప్రముఖ కవుల విగ్రహాలను తుర్క్ మెనిస్థాన్ అధ్యక్షుడు ఆవిష్కరించారు. ఈ విగ్రహాలలో ఒకటి గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఉందని గుర్తు చేశారు. ఇది గురుదేవ్ పట్ల గౌరవం, భారతదేశం పట్ల గౌరవం అన్నారు. జూన్ నెలలో రెండు కరేబియన్ దేశాలు సురినామ్ సెయింట్ విన్సెంట్, గ్రెనడైన్స్ తమ భారతీయ వారసత్వాన్ని ఉత్సాహంతో జరుపుకున్నారని ఆయన అన్నారు. సురినామ్‌లోని భారతీయ సంతతి ప్రతి సంవత్సరం జూన్ 5ని ఇండియన్ అరైవల్ డే, ఓవర్సీస్ డేగా జరుపుకుంటుందన్నారు.

ఇటీవల జరుపుకున్న యోగా దినోత్సవం ప్రాముఖ్యత గురించి ప్రధాన మంత్రి మరోసారి ప్రస్తావించారు. ఇది జీవితానికి ఎంత ముఖ్యమైనదో చెప్పారు. ఈ నెల 10వ యోగా దినోత్సవాన్ని ప్రపంచమంతా ఎంతో ఉత్సాహంగా, ఉత్సాహంగా జరుపుకుందని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నానని, కశ్మీర్‌లో యువతతో పాటు అక్కాచెల్లెళ్లు, కూతుళ్లు కూడా యోగా దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. జూన్ 30న ఆల్ ఇండియా రేడియో సంస్కృత బులెటిన్ ప్రసారమై 50 ఏళ్లు పూర్తి చేసుకుంటోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ బులెటిన్ చాలా మందిని 50 సంవత్సరాలుగా సంస్కృతంతో నిరంతరం కనెక్ట్ చేసింది. ఆల్ ఇండియా రేడియో కుటుంబాన్ని అభినందించారు మోదీ. బెంగళూరు-కబ్బన్ పార్క్ ఉందని చెప్పారు. ఇక్కడి ప్రజలు ఈ పార్కులో కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఇక్కడ వారానికి ఒకసారి, ప్రతి ఆదివారం, పిల్లలు, యువకులు, పెద్దలు తమలో తాము సంస్కృతంలో మాట్లాడుకుంటారని ప్రధాని మోదీ తెలిపారు.ఇదొక్కటే కాదు, ఇక్కడ సంస్కృతంలోనే అనేక డిబేట్ సెషన్స్ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని సమష్టి గుబ్బి జీ వెబ్‌సైట్ ద్వారా ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం ప్రారంభమైన ఈ ప్రయత్నం బెంగుళూరు ప్రజలలో చాలా త్వరగా ప్రాచుర్యం పొందింది. మనమందరం అలాంటి ప్రయత్నంలో పాలుపంచుకుంటే, ప్రపంచంలోని అటువంటి పురాతన, శాస్త్రీయ భాష నుండి మనం చాలా నేర్చుకోవచ్చని ప్రధాని మోదీ తెలిపారు.



## చిన్నవర్షం పడితే చాలు

- అన్నవరం వాగు పై వరద ఉధృతి
- 40 గ్రామాల రాకపోకలు బంద్

**టి మీడియా, జూన్ 30,విఆర్.పురం (అల్లూరి) :**
మండలంలోని రాత్రి కురిసిన వర్షానికి గుట్టలలోనుండి వరద రావడంతో బ్రిడ్జిపై నుండి వరద పోటెత్తింది. మండలానికి, గ్రామాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రేఖపల్లి పంచాయతీ గల అన్నవరం గ్రామం, ఉమ్మడివరం గ్రామం, మధ్యలో గల బ్రిడ్జి కూలిపోవడంతో తాత్కాలంగా నిర్మించిన బ్రిడ్జి ఎత్తు తక్కువగా కట్టడంతో చిన్న వర్షం కురిసినా మండలానికి నాలపై గ్రామాల రాకపోకలు నిలిచిపోతాయి. ఆదివారం ఉమ్మడివరం గ్రామస్తులు మాట్లాడుతూ %ా%. గత రెండు సంవత్సరాలుగా తాము పడుతున్న బాధలను చూసి అధికారులు ఎవరు పట్టించుకోవట్లేదు అని వర్షాకాలం వచ్చిందంటే తమ తిప్పలు దేవుడికే తెలుసని అన్నారు. మండలానికి రావాలంటే వేరే ప్రత్యామ్నాయం లేదని ఈ మార్గంలో నుండే ప్రజలు ప్రయాణం చేయాల్సి వస్తుందని అన్నారు. ఆస్పత్రికి బ్యాంకులకు నిత్యావసర సరుకులకు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటే ఇదే మార్గమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడిపోయిన బ్రిడ్జి నిర్మించేంతవరకు ప్రజలకు అవసరాలు నిమిత్తం నాటు పడవ ఏర్పాటు చేయాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. వర్షాలు మొదలవడంతో తమకు ఈ బాధలు తప్పేలా లేవని ఈ వాగుకి గుట్టలలో నుండి చెట్లతోపాటుగా వరద బీభత్సంగా వస్తుందని అన్నారు. గత సంవత్సరం వర్షాలకు వరదలకు ఈ బ్రిడ్జి ఒక సైడు కొట్టకుపోయిందన్నారు. దాన్ని తాత్కాలంగా మరమ్మతులు చేశారని ఇప్పుడు వరదలు వస్తే ఈ బ్రిడ్జి కూడా కొట్టకుపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు ప్రభుత్వం చొరవచూపి నాటు పడవ ఏర్పాటు చేయాలని నాలపై గ్రామ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. గత ప్రభుత్వం ఈ బ్రిడ్జిపై ఎలాంటి చర్య తీసుకోలేదని ఈ ప్రభుత్వము అయినా గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చొరవ చూపాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

## ఇద్దరు పిల్లలతో బావిలో దూకి మహిళ ఆత్మహత్య

**టీ మీడియా, జూన్ 30, అమరావతి:**



అత్తింటి వేధింపులు తట్టుకోలేక ఇద్దరు పిల్లలతో బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ పట్రపల్లెలో జరిగింది. సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ పట్రపల్లె గ్రామంలో రాణి అనే మహిళ హిమశ్రీ, జోష్మిత అనే ఇద్దరు తన కుమార్తెలతో కలసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఐదు సంవత్సరాల క్రితం రాయలపేటకు చెందిన దిలీప్ అనే వ్యక్తికి రాణిని ఇచ్చి వివాహం జరిపించారు. అత్తమామల పోరు, మగ బిడ్డ కావాలన్న ఆశ, వేధింపు, అత్తింటివారు నిత్యం డబ్బులు డిమాండ్ చేయడం లాంటి వేధింపు చర్యల కారణంగా %ా% తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తండ్రి వెంకటరమణ తెలిపి ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. బావిలో నుండి ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆగి ఉన్న గూడ్స్ రైలులో పొగలు..

**టీ మీడియా, జూన్ 30, జనగామ :**




జనగామ జిల్లాలో ప్రమాదవశాత్తు ఆగి ఉన్న గూడ్స్ రైల్లో పొగలు వచ్చాయి. రైల్వే అధికారుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సాయంతో పొగలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రైల్వే విద్యుత్ లైన్ నిలుపుదల చేస్తేనే పొగలను అదుపు చేసేందుకు సులభం అవుతుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. దీంతో విద్యుత్ నిలిపివేయడంతో పలు పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది.

## టీటీడీ వెబ్ సైట్లో బోర్డు నిర్ణయాలు

**టీ మీడియా, జూన్ 30, తిరుమల :**



2024 జూన్ 30: టీటీడీ ధర్మకర్తల మండలి లేదా స్పెసిఫైడ్ అథారిటీలు10-05-1993 నుండి 19-06-2023 వరకు తీసుకున్న నిర్ణయాలను ఇదివరకే టీటీడీ వెబ్ సైట్లో అప్ లోడ్ చేయడం జరిగింది. ఆ తర్వాత అప్ లోడ్ చేయలేదు. అయితే భక్తుల సౌకర్యార్థం టీటీడీ తీసుకుంటున్న పలు నిర్ణయాలకు సంబంధించి మరింత పారదర్శకతను పాటించడంలో లో భాగంగా 07-08-2023 నుండి 11-03-2024 వరకు ధర్మకర్తల మండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ప్రస్తుతం టీటీడీ వెబ్ సైట్లో అప్ లోడ్ చేయడమైనది.

## ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయురాలు

- సన్మానించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్
- వాకిటి శ్రీధర్

**టీ మీడియా, జూన్ 30, వనపర్తి బ్యూరో :**



తెలుగువాడ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన అనురాధ ని వారి దంపతులు కుమారస్వామి ఘనంగా సన్మానించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనురాధ వృత్తిలో ఎంతో గొప్ప పేరు తెచ్చుకున్నారని ప్రధానోపాధ్యాయురాలుగా ఉండి ఒకటవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు సబ్జెక్టులు బోధన చేసేవారని కొనియాడారు. అదేవిధంగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, వారు వారి జీవితంలో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ , ఉపాధ్యాయ నాయకులు శ్రీనివాసరావు, వరప్రసాదరావు , ప్రసాద్, మహానంది నాగన్న , చంద్రశేఖర్ , గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనవాహిని మధ్య రమేష్ రాథోడ్ అంతిమ వీడ్కోలు

- అంతిమయాత్రలో పలువురు నేతలు

**టి మీడియా, జూన్ 30, ఆదిలాబాద్:**



బీజేపీ నేత, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ (58) అంతిమయాత్ర అశ్రు నయనాల మధ్య ఉట్నూరులో కొనసాగింది. రాథోడ్ రమేష్ శనివారం తీవ్ర అస్వస్థతకు లోనై చనిపోయారు. కాగా, రాజకీయ పార్టీలకు అతీతంగా వేలాదిమంది ఉట్నూరుకు తరలివచ్చి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఆయన అభిమానులు గిరిజనులు వేల సంఖ్యలో బారులు తీరి తమ నేతను కడసారిగా సందర్శించి కన్నీటి పర్యంతమయ్యారు. 30 ఏళ్ల రాజకీయ సుదీర్ఘ జీవితంలో రమేష్ రాథోడ్ ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరుల ఆత్మబంధువుగా పేరు గడించారు. ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్ గా, ఎంపీగా అనేక పదవులు అలరించి జిల్లాకు వన్నెతెచ్చిన మహానేత రాథోడ్ ఇక లేరన్న వార్తతో గిరి పల్లెల్లో విషాదఛాయలు అమ్ముకున్నాయి. ఐదు కిలోమీటర్ల పొడవునా సాగిన అంతిమయాత్రలో వివిధ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో జనంపల్లి వచ్చి ఘన నివాళులర్పించారు.

### బీజేపీకి తీరని లోటు: బండి సంజయ్

పేద గిరిజనుల పెన్నిధిగా రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని అనేక పదవులు అలరించి అకాల మరణం పొందిన రమేష్ రాథోడ్ మృతి బిజెపికి తీరనిలోటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. తనతో రాథోడ్ కు ఉన్న అనుబంధాన్ని బండి సంజయ్ గుర్తు చేసుకున్నారు. పార్టీ ఒక పెద్దదిక్కుని కోల్పోయిందని, గిరిజనుల కోసం మారుమూలపల్లెల అభివృద్ధికి రాథోడ్ చేసిన సేవలను కొని యాడారు.

### అంతిమయాత్రలో పలువురు నేతలు..

అంతిమయాత్రలో ఎంపీ లు గోడం నగేష్, ఈటెల రాజేందర్, ఎమ్మెల్యేలు వెధమ బొజ్జు, అనిల్ జాదవ్, పాయల్ శంకర్, జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎంపీ సోయం బాపూరావ్, మాజీ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న, అమర్ సింగ్ తిలావత్ , మాజీ ఎమ్మెల్యేలు ఎంపీలు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నేతలు పాల్గొన్నారు. రమేష్ రాథోడ్ భౌతికకాయంపై బిజెపి జెండాను కప్పి పార్టీ నాయకులు నివాళులర్పించారు. అంతిమయాత్రలో రాథోడ్ రమేష్ అమర్ రహే నినాదాలు మిన్నంటాయి. ఆయన పెద్ద కొడుకు రితేష్ రాథోడ్ చితికి నిప్పంటించి విలపించారు.

## పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన అంతర్జాతీయ నిపుణులు

**టి మీడియా, జూన్ 30, ఏలూరు ప్రతినిధి :**



పోలవరం ప్రాజెక్టును ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ నిపుణుల బృందం పరిశీలన చేయనుంది. అమెరికా, కెనడా నుంచి వచ్చిన నలుగురు నిపుణులు.. ఆదివారం ఉదయం ప్రాజెక్టు వద్దకు చేరుకుని అక్కడి పరిసరాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అమెరికా నుంచి డేవిడ్ పి పాల్, గెయిన్ ఫ్రాంకో డి సిక్కో, కెనడా నుంచి రిచర్డ్ డానెల్లీ, సీన్ హించ్ బెర్గర్ హాజరయ్యారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రాజెక్టు ప్రాంతానికి నిపుణుల బృందం చేరుకుంది. తొలి రోజు కాఫర్ డ్యాంతో పాటు ఇతర పనుల తీరును పరిశీలించారు. 10:30 గంటలకు పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే చేరుకుని ప్రాజెక్టు వ్యూ పాయింట్‌పై నుండి ప్రాజెక్టు పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు మ్యాప్ చూపించి సంబంధిత వివరాలు విదేశీ నిపుణుల బృందానికి తెలిపారు.కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. వరదలకు దెబ్బ తిన్న రిటర్నింగ్ వాల్‌తోపాటు, కాఫర్ డ్యాం, గైడ్ బండ్‌ను పరిశీలించారు. వైసిపి ప్రభుత్వం పోలవరంను నాశనం చేసిందని విమర్శించారు. అనంతరం పోలవరంపై శ్వేత పత్రం విడుదల చేశారు. తిరిగి ప్రాజెక్ట్ పనులను ఎలా ప్రారంభించాలి అనే దానిపై నిపుణుల బృందాన్ని నియమించారు. బృందం పరిశీలన చేసి నివేదిక ఇచ్చిన తర్వాత పనులను ఏవిధంగా ముందుకు తీసుకువెళ్లలో ప్రభుత్వం నిర్ణయించనుంది..

## నేరుగా పథకాలు ప్రజల్లోకి

**టీ మీడియా, జూన్ 30, గోదావరిఖని ప్రతినిధి:**



కేంద్ర ప్రభుత్వ పథకాలు సాధారణ ప్రజలకు మన్ కీ బాత్ కార్యక్రమంలో వీక్షించవచ్చని భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ కో- కన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్ యాదవ్ అన్నారు. ఎన్ టి పి సి లోని జ్యోతి భవన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి దిగ్విజయంగా గెలుపొంది మన్ కీ బాత్ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ హాజరై మాట్లాడారు. మన్ కీ బాత్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని దీంతో నిరుపేదలకు ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు అన్నారు. బడుగు, బలహీన వర్గాల అందరికీ దేశంలో సంక్షేమ పథకాలు అందజేస్తుందని వివరించారు. ప్రతి ఆదివారం బూత్ స్థాయిలో ప్రజలందరికీ అందుబాటులో ఉంచే విధంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ, రామగుండం కార్పొరేషన్ బీసీ మోర్చా మాజీ అధ్యక్షులు రాములు యాదవ్, మహేందర్, మల్లేష్, సమ్మిరెడ్డి, బిఎంఎస్ కాంట్రాక్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కరపత్రాలను పంపిణీ ఆర్టీసీ కార్మికులు

**టీ మీడియా, జూన్ 30, వనపర్తి బ్యూరో :**



వనపర్తి డిపో ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హయ్యర్ పెన్షన్ రిజెక్ట్ చేయబడ్డ 7373 మందికి న్యాయం చేయాలని, పిఎఫ్ హయ్యర్ పెన్షన్ లో లోపాలను సవరించాలని రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాన్ని ఆదివారం వనపర్తి డిపో దగ్గర ఆర్టీసీ కార్మికులకు ఉదయం 5 గంటల నుండి ఎస్డబ్ల్యూఎఫ్ వనపర్తి డిపో అధ్యక్షుడు జె.వి .స్వామి, డిపో కార్యదర్శి ఏ కృష్ణయ్య, కమిటీ సభ్యులు కె . శ్రీనివాసులు కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు మెకానిక్ పాల్గొన్నారు.

## చైతన్య హాస్టల్లో ఫుడ్ పాయిజన్

- 70 మంది విద్యార్థులకు అస్వస్థత

**%టి మీడియా, జూన్ 30, కరీంనగర్:**



పట్టణంలోని మిషన్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న శ్రీ చైతన్య రెసిడెన్సి కాలేజీలో ఫుడ్ పాయిజన్ జరిగింది. ఫుడ్ పాయిజన్ ఆయన ఆహారం తిని కళాశాలలోని 70 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. దీంతో చైతన్య రెసిడెన్స్ కాలేజీ యాజమాన్యం నుండి విద్యార్థులను అంబులెన్స్ లో దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.అయితే వెంటనే విషయాన్ని గుర్తించిన కళాశాల యాజమాన్యం విద్యార్థినులకు సకాలంలో సరైన మాత్రలు ఇవ్వడంతో 20 మంది విద్యార్థులకు హాస్టల్లోనే ఉంచి వైద్యాన్ని అందించారు. ఇక తీవ్రంగా అస్వస్థకు గురైన 20 మంది విద్యార్థినిలను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నట్లు సమాచారం.

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్..

**టి మీడియా, జూన్ 30, హైదరాబాద్:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్తుపల్లిలో రోడ్డు ప్రమాదం జరిగింది. సత్తుపల్లి మండలంలోని కిష్టారం సమీపంలో ఆర్టీసీ బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో 12 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం వైపు బయల్దేరింది. ఈ క్రమంలో రాజమహేంద్రవరం నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ కిష్టారం సమీపంలో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. సమాచారం అందుకున్న హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంతో సుమారు కిలోమీటరుమేర వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## ఎమ్మెల్యే ను కలిసిన ఐఎన్టియుసి నాయకులు

**టీ మీడియా, జూన్ 30, గోదావరిఖని ప్రతినిధి:**



రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ను మర్యాదపూర్వకంగా ఐఎన్టియుసి నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎన్టియుసి నాయకులు నరసింహ రెడ్డి, ధర్మపురి మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గం లోని, నిరుద్యోగ యువత కోసం ఉపాధి కల్పించాలని రామగుండం లోని బి పవర్ స్టేషన్ ను పునరుద్ధరించాలని సంస్థ ఎండిని అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఒప్పించి, మెప్పించి రామగుండం నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడంలో ముందున్నాడని, అభినందించవలసిన విషయమని ఐ ఎన్ టి యు సి నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవన్, సదానందం, దాస్, రమేష్, శ్రీనివాస్, ఏ శ్రీనివాస్, అంజనేయులు, నరసయ్య, తిరుపతి, అశోక్, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, సంపత్ ,వెంకటేష్ లతో పాటు, ఐ ఎన్ టి యు సి నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వకుళా మాత ఆలయ వార్షికోత్సవం

**టీ మీడియా, జూన్ 30,తిరుపతి:**



తిరుపతి సమీపంలోని పాత కాల్వ వద్ద పేరూరు బండపై ఉన్న శ్రీ వకుళా మాత ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, తోమాల, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షబంధనం, అగ్ని ప్రతిష్ట, కలశారాధన, మహాశాంతి హెూమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి ఉత్సవర్లకు అష్టోత్తర కలశాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, విజిఓ శ్రీ బాలిరెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ శివకుమార్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం

## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**టీ మీడియా, జూన్ 30,హైదరాబాద్:**
తెలంగాణలోని పలు జిల్లాల్లో రాబోయే 3 రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. కాగా, హైదరాబాద్‌లో ఇప్పటికే ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాం కురుస్తుంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, యూసుఫ్ గూడ, మాదాపూర్, కొండాపూర్, కూకట్ పల్లి పరిసర ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా వర్షం రావడంతో రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.



### రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని.. ఉత్తర ఒడిశా %-% పశ్చిమబెంగాల్ తీరాలకు ఆనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సముద్ర మట్టానికి 7.6 కి.మీల ఎత్తులో నైరుతి దిశగా ఆవర్తనం ఉందని చెప్పారు. వీటి ప్రభావంతో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు కురుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

### అటు ఏపీలోనూ..

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 3 రోజులు ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. నెల్లూరు, కావలి, ఒంగోలు, బాపట్ల, మచిలీపట్నం, భీమవరం, గన్నవరం, అన్నవరం, కాకినాడ, అమలాపురం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అటు, శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం, నెల్లూరు, నంద్యాల, అనకాపల్లి, సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని చోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, పార్వతీపురం మన్యం, అల్లూరి, అనకాపల్లి, కోనసీమ, తూ.గో., ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

# వెలుగుచూసిన మరో స్కామ్

- ఎనిమిది మంది అరెస్ట్

**టీ మీడియా, జూన్ 30, న్యూఢిల్లీ :**
నీట్ స్కామ్ మరువక ముందే అస్సాంలోని బిజెపి ప్రభుత్వంలో మరో స్కాం వెలుగుచూసింది. మార్క్‌షీట్ స్కామ్‌కి సంబంధించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని పోలీసు అధికారులు తెలిపారు. గౌహతి యూనివర్శిటీకి అనుబంధంగా ఉన్న గణేష్ లాల్ చౌదరి కాలేజీకి చెందిన విద్యార్థి మార్క్‌షీట్‌లో తేడాపై విచారణతో ఈ స్కామ్ బయటపడింది. డిజిటల్ ట్యాంపరింగ్‌తో కొంతమంది ఈ స్కామ్‌కి పాల్పడుతున్నారని, మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. అజీజుల్ హక్ మార్క్‌షీటుపై కాలేజీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాస్తవానికి విద్యార్థి పొందిన మార్కుల కన్నా మార్క్‌షీటులో ఎక్కువ మార్కులు ఉన్నట్లుతెలిపింది.విచారణలో .. విద్యార్థి మొదటి, మూడు, నాలుగు, ఐదవ సెమిస్టర్‌లలో మార్కులు మార్చడానికి రూ.10,000 చెల్లించినట్లు అంగీకరించాడు. బార్‌పేటలో ఆరు కేసులు వెలుగు చూశాయని, ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. గౌహతి విశ్వవిద్యాలయం ఇంటిగ్రేటెడ్ యూనివర్శిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐయుఎంఎస్) ని థర్డ్‌పార్టీకి ఆపరేటర్‌కి అవుట్ సోర్స్ కింద ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐటిఐ లిమిటెడ్ అనేది డేటా ఎంట్రీ బాధ్యత వహించే కేంద్ర ప్రభుత్వ సంస్థ అని, ట్యాంపరింగ్ జరిగినట్లు ఆ వర్గాలు తెలిపాయి.బార్‌పేట, ధుబ్రి, కమ్‌రూప్ (మెట్రో) మరియు నాగావ్ అనే నాలుగు జిల్లాల నుండి అరెస్టులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. కృష్ణమూర్తి, ఇస్మాయిల్ హుస్సేన్, అలంగీర్ ఖాన్, మొయినుల్ హక్, అబుల్ బాసర్, అమీనుల్ ఇస్లాం, హమేజుద్దీన్, శివతోష్ మహతోలను అరెస్ట్ చేశామని చెప్పారు. కృష్ణమూర్తి ఈ స్కాంలో కీలకపాత్రధారి అని, యూనివర్శిటీ బృందానికి నేతృత్వం వహించాడని అన్నారు.




## బస్టాండ్ లో ఒక గుర్తు తెలియని యువకుని మృతదేహం

**టీ మీడియా జూన్ 30. గుమ్మడిదల:**
మృతుని చిరునామా తెలిసిన వారు వెంటనే గుమ్మడిదల్ల పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఎస్.ఐ మహేశ్వర రెడ్డి కోరారు. బస్ స్టాండ్ లో ఓ గుర్తు తెలియని యువకుని మృతదేహం గుర్తించారు.మృతుడి వయస్సు దాదాపు 35 సంవత్సరాలు ఉండొచ్చని యువకుని కుడి చేతి పై త్రిశూలం పచ్చబొట్టు ఉందని ఈ వ్యక్తికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ కార్యాలయం జిన్నారం, ఫోన్ నెంబర్ కు 8712656730, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గుమ్మడల్ల పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712656751 నెంబర్ కి సమాచారం అందించాలని ఎస్.ఐ మహేశ్వర రెడ్డి తెలిపారు.



## పుట్టు చీర కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ

**టీ మీడియా జూన్ 30 చిన్నంబావి:**
చిన్నంబావి మండల కేంద్రం లోని వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ లింగస్వామి, వరలక్ష్మి, లా కూతురు కావ్య శ్రీ, పుట్టు చీర, కుమారుడు జశ్వంత్, లా పుట్టు పంచ కార్యక్రమం నిర్వహించారు.వారి ఆహ్వానం మేరకు జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకట్రామమ్మ, హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమం లో జెడ్పీటీసీ తో పాటు బి.ఆర్.యస్.మండల సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ యాదవ్,తదితరులు,పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.



## గాయపడిన విద్యార్థి సంపత్

- ప్రమాదబాధితుడిని ఆదుకుంటున్న అధ్యాపకులు

**టీ మీడియా, జూన్ 30,కారేపల్లి :**
కారేపల్లి కి రామగిరి సంపత్ కారేపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నాల్గు రోజుల క్రితం లారీ ఢీకొని తలకు గాయమై మెదడు దెబ్బతగలటంతో ఆసుపత్రిలో జీవచ్ఛవంగా పడి ఉన్నాడు. వైద్యం చేయించటానికి తండ్రిలేడు, తల్లికి ఆర్థిక స్తోమత లేక తల్లడిల్లుతుందని తెలుసుకున్న కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ విద్యార్థి వైద్యం కోసం ముందుకొచ్చారు. ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రూ.62531 లను అధ్యాపకులు బాధిత కుటుంబానికి అందజేశారు. తమ కళాశాల ఆధ్యాపకులతో పాటు విద్యార్థులు కూడా తమ తోటి మిత్రుడిని కాపాడుకోవటానికి ఆర్థిక సాయం చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆర్థికసాయం చేసిన వారిలో కేఎస్.రామారావు, అనిత, నాగేశ్వరరావు, చీన్యా, రాజకుమారి, సాగర్, కలాం ప్రసాద్ తదితరులు ఉన్నారు.



## మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బిజెపి నాయకులు

**టీ మీడియా జూన్ 30 చిన్నంబావి:**
చిన్నంబావి మండలం కొప్పునూర్ గ్రామంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోది,నిర్వహించిన మాన్ కి బాత్ కార్యక్రమాన్ని మండల బీజేపీ నాయకులతో కలసి బిజెపి జిల్లా అధ్యక్షులు, ఎల్లేని సుధాకర్ రావు, మాన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమం లో ఎల్లేని తో పాటు మండల బిజెపి అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్ రెడ్డి, మండల నాయకులు సత్యరెడ్డి, నంది శేఖర్ రెడ్డి, గోపి నాయుడు, బీజేపీ యువ నాయకులు జింకల కిరణ్ కుమార్ నాయుడు,తదితరులు, పాల్గొన్నారు.



## రేబిస్ నివారణకు టీకాలు

### -పంచాయతీ కార్యదర్శి, వెటర్నరీ డాక్టర్

**టీ మీడియా, జూన్ 30 , పటాన్ చెరు:** నియోజకవర్గంలోని ముత్తంగి గ్రామపంచాయతీలో వీధి కుక్కల నియంత్రణకు గ్రామపంచాయతీ కార్యదర్శి జే దయానంద్ విస్తృత చర్యలు చేపట్టడం జరిగింది. ప్రభుత్వం జారీ చేసిన వీధి కుక్కల బెడద నివారణకు పంచాయతీ పరిధిలో జంతు పరిరక్షణకు పలుచర్యలు చేపట్టడంతో పాటు నగరం నలువైపులా ఏర్పాటు చేసిన జంతు సంరక్షణ కేంద్రాలను కుక్కల జనన,నియంత్రణతో పాటు రేబిస్ వ్యాధి నివారణకు మున్సిపల్ గ్రామపంచాయతీ వాడల్లోని చర్యలు తీసుకుంది. వెటర్నరీ జూనియర్ డాక్టర్ పద్మ మాట్లాడుతూ కుక్కకాటుకు నివారణకు ప్రజలను అప్రమత్తం చేసేందుకు తగిన ముఖ్యంగా కుక్కల కాటు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలు తెలుసుకునేందుకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలను, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంది.కుక్క కాటు నివారణకు పాఠశాల, కళాశాల, విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు.అంతేకాకుండా ఫిర్యాదు వచ్చిన వెంటనే కుక్కలను యానిమల్ కేర్ సెంటర్ కు తీసుకొని వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. ముత్తంగి గ్రామ పంచాయతీ కార్యదర్శి జే దయానంద మాట్లాడుతూ ఇటీవల జరిగిన వీధి కుక్కల దాడిలో ఎంతోమంది చిన్నారులు మృతి చెందడం గాయపడటం జరిగింది. దీనికోసం ప్రభుత్వం నిర్ణయించిన ఆంటీ రేబిస్ టీకాల ప్రక్రియ పూర్తిస్థాయిలో నివారణ జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ప్రజలకు పలు కాలనీవాసులకు జంతు ప్రేమికులకు కుక్కల ప్రవర్తన వ్యవహరించడంలో చేయవలసిన చేయకూడనివి జాగ్రత్తల పైన అవగాహన చేస్తున్నట్లు పేర్కొన్నారు.



## మహిళలపై దాడి ని ఖండిస్తూ ప్రజా సంఘాల నిరసన

- భూ మాఫీయా దౌర్జన్యాలను, వ్యతిరేకించాలి

**టీ మీడియా, జూన్ 30,ఖమ్మం:**
భూమికి సంబంధించిన వివాదం కోర్టు పరిధిలో ఉండగా కొందరు భూ మాఫీయా గా తయారై స్థలం తమదేనంటూ ఆ భూమిలో ప్రవేశించి, అక్కడున్న మహిళలపై దౌర్జన్యం , పాశవిక దాడి చేయడానికి ఖండిస్తూ ఆదివారం జిల్లా పరిషత్ సెంటర్ లో పలు ప్రజా సంఘాలు నిరసన ప్రకటించాయి. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక , వీర నారీమణుల ఆశయ సాధన సమితి , మహాత్మ జ్యోతిబా పూలే ఐడియాలజీ సొసైటీ బాధ్యులు ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె వి. కృష్ణారావు మాట్లాడుతూ మహిళలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఒక స్థల వివాదం కోర్టు పరిధిలో ఉండగా ఇరుపక్షాలు ఆ స్థలంలో ప్రవేశించకూడదని , కోర్టు తుది తీర్పు వచ్చేవరకు ఉండకుండా వాసిరెడ్డి శ్రీనివాస్ మరి కొందరు ఆ స్థలంలో ప్రవేశించి , ఈ స్థలం తమదేనంటూ మహిళలపై దాడికి దిగటం హేయమైన చర్య అన్నారు. ఇలా ఒకసారి కాకుండా పలుసార్లు కూడా దాడులకు పాల్పడటం గమనిస్తుంటే కొంతమంది స్థానిక అధికారుల అండదండలు ఉన్నట్లు కనిపిస్తుందనీ ఆరోపించారు. ఖమ్మం నగరంలో ఒక భూ మాఫియా కొత్తగా తయారై భూ దందాలకు పాల్పడుతున్నట్లుగా ఈ ఉదంతం స్పష్టం చేస్తుందన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు వలె ఖమ్మం నగరంలో కూడా భూ మాఫియా తయారైందని , అధికారులు దీనిపై దృష్టి సారించకుండా వదిలి వేస్తే ప్రభుత్వ భూములను కూడా ఈ మాఫియా కబ్జా చేయడం ఖాయమన్నారు. ఈ స్థలం తమదే అని అంటున్న వాసిరెడ్డి శ్రీనివాస్ ఇందులో రాజకీయ నాయకులను లాగడం ఎందుకని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు కూడా వాస్తవాలను పరిశీలించకుండా గుడ్డిగా ఒక వ్యక్తిని నమ్మడం సమాజ సం కాదన్నారు. కోర్టు, పోలీసుల వ్యవస్థ ఉండగా క్రిమినల్స్ తరహాలో వాసిరెడ్డి శ్రీనివాస్ వంటి వ్యక్తులు చట్టాన్ని తమ చేతులు తీసుకోవడం ఏమాత్రం భావ్యం కాదన్నారు. పదేపదే ఈ విధమైన దౌర్జన్యాలకు పాల్పడితే క్షమించేది లేదని , ప్రజాస్వామ్య బద్ధంగానే తాము ఈ సమస్యను ఎదుర్కొంటామని , దీనిపై మరింత ఆందోళన కార్యక్రమాలను తలపెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ ,మహాత్మ జ్యోతిబా పూలే ఐడియాలజీ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పేల్లూరి విజయకుమార్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు బాలిని భాస్కర్ రెడ్డి , దొడ్డ శ్రీనివాస్ రెడ్డి , బాధితులు చేపూరి సంధ్యారాణి , శ్రావణి , నైనీషా, మలీదు నవజ్యోత్ , వీర నారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి , జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడాల ఝాన్సీ , ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పగిడిపల్లి నాగేశ్వరావు, రవీందర్ నాయక్ , మహిళా నాయకురాలు అనంత లక్ష్మి , ధనలక్ష్మి, స్వరూప ,చంద్రకళ, జయ, మరియ కుమారి ,జ్యోతి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



## కలకలం రేపుతున్న చిరుత సంచారం

- మహానందిలో మళ్ళీ ప్రత్యక్షం..
- అటవీ శాఖ అధికారులకు సవాల్ విసిరుతున్న చిరుత..
- చిరుతను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు విఫలం..

**టీ మీడియా, జూన్ 30, మహానంది:**
మహానంది క్షేత్ర పరిధిలోని పరిసరాల్లో గత కొన్ని రోజులుగా చిరుత సంచారం కలకలం రెపుతుంది. చిరుత పులి సంచారంతో భక్తులు, గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఉదయం రాత్రి వేళల్లో సంచరిస్తూ భక్తులను, ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తోంది. మరొకసారి ఆదివారం తెల్లవారుజామున, శ్రీ కామేశ్వరి అమ్మవారి సత్రం, మాడ వీధుల్లో సంచరించిన చిరుత పులిని, సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు.చిరుత పులిని బంధించడంలో, ఎందుకు ఆలస్యం వహిస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు, భక్తులు వాపోతున్నారు. మహానంది క్షేత్ర పరిసరాల్లో చిరుత సంచారం అధికంగా ఉందని, అటవీ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.



## ఈశ్వరమ్మ కు లక్ష రూపాయల చెక్కును అందజేసిన మంత్రి

**టీ మీడియా, జూన్ 30, వనపర్తి బ్యూరో :**
నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లి గ్రామ ఆదివాసీ మహిళ ఈశ్వరమ్మ కి లక్ష రూపాయల చెక్కు ను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం అందజేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని మంత్రి జూపల్లి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళా ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి ఇంతకు ముందే భరోసానిచ్చారు. మరో 3 లక్షల రూపాయాలు త్వరలో అందజేస్తామని మంత్రి తెలిపారు.వారి పిల్లలకు ఉచిత విద్యను అందిస్తామని, అందుకు అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని ఇంతకుముందే హామీనిచ్చారు.



## ఫ్యూడల్ శక్తులపై తిరుగుబాటు ప్రకటించిన హేమంత్ సోరెన్

**టీ మీడియా, జూన్ 30, రాంచీ :**
ఫ్యూడల్ శక్తులపై జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తిరుగుబాటు ప్రకటించారు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా బ్లాక్ ' దేశం నుండి బిజెపిని తరిమికొడుతుందని స్పష్టం చేశారు. గిరిజనుల ప్రత్యేకంగా జరుపుకునే 'హుల్ దివస్' సందర్భంగా బగ్నాడిహ్‌లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను జైలు నుండి విడుదలైన తర్వాత కాషాయం పార్టీ కల్లోలంగా మారిందని, బిజెపి నేతలు తనకి వ్యతిరేకంగా మళ్లీ కుట్ర పన్నుతారని అన్నారు. ఈ రోజు మనందరికీ స్ఫూర్తిదాయకమైన రోజు అని, మిమ్మల్ని ఉద్దేశించి మాట్లాడేందుకు ఈ రోజు మొదటిసారిగా నా ఇంటి నుండి బయటికి వచ్చాను. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సంతాల్ తిరుగుబాటులానే మనం హల్ తిరుగుబాటుని ప్రకటిద్దాం. ఫ్యూడల్ శక్తులను జార?ండ్ నుండే కాకుండా దేశం నుండి తరిమికొట్టాలి" అని అన్నారు. జార?ండ్‌ను విప్లవకారుల భూమిగా పిలుస్తారు. జైలు శిక్షకు, లాఠీ చార్జ్ లేదా ఉరిశిక్షకైనా భయపడమని పునరుద్ఘాటించారు.



## ఘనంగా కే యస్ జి యవసేన వార్షికోత్సవం

**టీ మీడియా, జూన్ 30 , జిన్నారం:**
మండల కేంద్రంలో కే యస్ జి యవసేన వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది .కాట శ్రీనివాస్ గౌడ్ అడుగు జాడలోకే యస్ జి యవసేన ఆధ్వర్యంలో పటాన్ చెరు నియోజకవర్గంలో ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్నాము ముందు ముందు ప్రజా సేవలో కే యస్ జి యవసేన ఉంటుంది ఈ టిపిసిసి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జిన్నారం మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు, గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మద్ది వీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్ది ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీలు నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్ , తులసిదాస్, మహేష్, నరేందర్ గౌడ్, కే యస్ జి యవసేన జిన్నారం, గుమ్మడిదల మండల అధ్యక్షులు సురేష్, సుధాకర్ మల్లేష్, సభ్యులు నాగరాజు, మోహన్, నవీన్ మండల నాయకులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.





## రేషన్ అక్రమాలకు అడ్డాగా ఆ పోర్ట్..

### -మంత్రి నాదెండ్ల స్పెషల్ ఫోకస్..

**టీ మీడియా జూన్ 30 , అమరావతి:**పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో తిష్ట వేసి అధికారులకు చెమటలు పట్టించారు. కాకినాడ పోర్టుతో పాటు జిల్లాలో పలు రైస్ మిల్లులపై రివ్యూ చేసి అక్రమ బియ్యం వ్యాపారంపై అధికారులను నిలదీశారు. అయితే నాదెండ్ల తరువాత పవన్ ఎంట్రీ ఉండబోతోందనే టాక్ వినిపిస్తోంది. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని క్షేత్రస్థాయిలో రీసైకిలింగ్ చేసి విదేశాలకు తరలించేవారిపై సమగ్ర విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. మొదట పోర్ట్ ఏరియాలోని పలు గోదాముల్లో అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. ఇందులో ఆరు రైస్ మిల్స్ నుంచి పిడిఎఫ్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. రైస్ మిల్స్ వెనుక మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి హస్తం ఉందంటూ చెప్పకనే చెప్పేశారు. ఇటు కాకినాడ పోర్ట్‌లో కూడా తిష్ట వేసి ద్వారంపూడి కుటుంబ దౌర్జన్యంగా అడ్డగోలుగా సముద్రంలో ఓడలు కొనే స్థాయికి ఎదిగారంటూ ఆరోపించారు. అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.కాకినాడ జిల్లాలో ఒక రోజుతోనే సమీక్షలు సరిపెట్టుకోలేదు మంత్రి నాదెండ్ల. రెండో రోజు కూడా కాకినాడ జిల్లా పర్యటించారు. ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బియ్యం నిల్వల కేంద్రాలను తనిఖీలు చేశారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులకు ప్రభుత్వం ద్వారా రవాణ చేస్తున్న బియ్యాన్ని నిజాయితీగా చేరేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి నష్టం కలిగించేలా పనిచేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు నిర్వహించిన పది ప్రాంతాల్లో ఏడు చోట్ల పీడీఎస్ బియ్యం ప్రెడింగ్ చేస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు దొరికాయన్నారు. వీరందరి మీద లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా కేసులు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ ప్రాంతాన్ని మాఫియాకు అడ్డాగా తయారు చేశారని, 2018-24 మధ్య చాలా మార్పు ఉందన్నారు. పీడీఎస్ బియ్యానికి సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేయడం ప్రారంభించామని మంత్రి స్పష్టం చేశారు. ఈ క్రమంలో అధికారులు నిజాయితీగా పనిచేసి, ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఆధారాలు దొరికిన చోట స్టార్ పేజ్ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖలు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తనిఖీలు భవిష్యత్తులో ఇంకా కొనసాగుతాయన్నారు మంత్రి నాదెండ్ల.నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కొన్ని రోజుల్లోనే కాకినాడలో తిష్ట వేసి కాకినాడ పోర్టుపై దృష్టి సారించారు. దీనికి కారణం 2023 జూన్ %-% జూలైలో పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో కాకినాడ స్థానిక ప్రజల నుంచి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి పెద్ద మొత్తంలో రేషన్ తరలిపోతున్నట్టు ఫిర్యాదు చేయడమే. ఈ నేపథ్యంలోనే పలుమార్లు పవన్ కళ్యాణ్‌ను విమర్శించిన ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చేస్తున్న అక్రమాలు, బాగోతాలు అధికారంలోకి రాగానే బయట పెడతానని కాకినాడ సభల్లో పవన్ కళ్యాణ్ నేరుగానే చెప్పారు. ఈ నేపథ్యంలోనే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ జీవనాడైన పోర్టుపై దృష్టి పెట్టారు. మొదటిరోజు 5300 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంతో పాటు రెండవ రోజు ఏడువేల మెట్రిక్ టన్లకుపైగా రేషన్ బియ్యాన్ని గుర్తించారు. సముద్ర మార్గం ద్వారా ఓడల్లో ఆఫ్రికాకు తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని వెంటనే నిలిపివేయాలంటూ అధికారులకు సూచించారు. ఇంకా మారని అధికారులు ఎవరైనా ఉంటే వారి ప్రవర్తన మార్చుకోవాలంటూ హెచ్చరించారు. ఇది ఇక్కడితో ఆగదని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన వెనుకున్న అనుచరుల అక్రమాలన్నీ బయటపడతామని హెచ్చరించారు. జులైలో మూడు రోజులపాటు పవన్ కళ్యాణ్ కూడా కాకినాడ జిల్లాలో అధికారులతో సమీక్షించబోతున్నారు. ఈ నేపథ్యంలో పవన్ పర్యటన కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

## దుకాణ షెట్టర్ విషయమై వివాదం

### -కిరోసిన్ డబ్బలో మహిళ అందోళన

**టీ మీడియా జూన్ 30 ,టీ మీడియా, జూన్ 30,కారేపల్లి :**
కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఎ ా ్య ఎ ా ం ‍ సముదాయం(దుకాణం గది) విషయమై వివాదంతో మహిళ కిరోసిన్ డబ్బతో వ్యాపార కాంప్లెక్స్ ముందు అందోళనకు దిగిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లోని సాయిలు మాస్టర్ కాంప్లెక్స్ లో ఒక గది నాది అంటూ అందోళన చేసిన మహిళకు సంబంధించినది. ఆ గదిని దాని పక్కనే ఉన్న వ్యాపారికి కొన్ని సంవత్సరాల క్రితం తాకట్టు పెట్టి పైకం తీసుకున్నారు. అప్పు పైకం చెల్లించక పోవటంతో వ్యాపారి ఆ గదిని పూర్తిగా స్వాదీనం చేసుకోని మార్పులు చేర్పులు చేసుకున్నాడు. గదిని తాకట్టుపెట్టిన వారు తాము అప్పుచెల్లిస్తామని తమ గదిని తమకు అప్పగించాలని చెప్పినా వ్యాపారి గదిని అప్పగించకుండా బెదిరిస్తున్నాడంటూ తాకట్టుపెట్టిన వారు అందోళనకు దిగారు. తమకు తాకట్టుపెట్టిన షాపు ను కొనుగోలు చేయటం జరిగిందని, దీనిపై కోర్టులో కూడా కేసు నడుస్తుందని వ్యాపారి సంబంధికులు తెలిపారు. కారేపల్లిలో ప్లాట్ల రేట్లు పెరగటంతో షాపు తాకట్టుపెట్టి తర్వాత అమ్మి ఇప్పుడు దానిపై వివాదం చేస్తున్నారని వ్యాపారి సంబంధికులు ఆరోపించారు. వివాదం నడుస్తుండటంతో పోలీసులు అప్రాంతానికి చేరుకోని ఇరువర్గాలను సముదాయిస్తూ సివిల్ మేటర్ కోర్టు ద్వారా తేల్చుకోవాలని అప్పటి వరకు వివాదం చేయవద్దని సూచించారు.

